

రవాణారంగ సమస్యలపై 13న రౌండ్‌టేబుల్ సమావేశం

ప్రజాశక్తి-విజయనగరంటౌన్

రవాణా రంగ కార్మికుల సమస్యలపై చర్చించేందుకు ఈనెల 13న ఉదయం 10:30 గంటలకు కెఎల్‌పురం ఎన్‌పిఆర్ భవన్‌లో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహిస్తున్నామని ఆలిండియా రోడ్ ట్రాన్స్‌పోర్టు వర్కర్స్ ఫెడరేషన్ (సిఐటియు) జిల్లా కన్వీనర్ ఎ.జగన్మోహన్‌రావు, స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర కార్యదర్శి వి. రాములు తెలిపారు. ఈ మేరకు ఆదివారం పోస్టర్ విడుదల చేశారు. సరుకు, ప్రజా రవాణాలో కీలక పాత్ర పోషిస్తున్న ట్రాన్స్‌పోర్టు యాజమాన్యాలు, డ్రైవర్ల, వర్కర్ల సమస్యలు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు పట్టడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. రవాణా రంగ కార్మికుల రక్షణ కోసం సంక్షేమ చట్టం చేయాలని, ఎంవి యాక్ట్ 2020 లో ప్రమాదకరమైన అంశాలను రద్దు చేయాలని ఈనెల 16న దేశ వ్యాప్తంగా సమ్మె జరుగుతుందని, ఈ సమ్మె విజయవంతానికి రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహిస్తున్నామని తెలిపారు. లారీ ,ఆటో, క్యాబ్ ,లగేజ్ వెహికల్స్, ఆర్‌టిసి, అద్దె బస్సు తదితర ట్రాన్స్‌పోర్టు ఓనర్ కమ్ డ్రైవర్లు, వర్కర్లంతా పాల్గొనాలని పిలుపునిచ్చారు.

అసంపూర్తిగా భవన నిర్మాణాలు

ప్రభుత్వం ప్రాధాన్యతా పనులుగా భావించిన భవన నిర్మాణాలు చాలా వరకు అసంపూర్తిగాను, పునాదుల స్థాయిలోనూ ఉండిపోయాయి. కేంద్ర ప్రభుత్వం ఏటా విడుదల చేయాల్సిన నిధులు మంజూరు చేయకపోవడం, నిధులు రాబట్టుకునే విషయంలో రాష్ట్ర ప్రభుత్వం మెతకవైఖరి ప్రదర్శించడమే ఇందుకు ప్రధానమైన కారణాలుగా కనిపిస్తున్నాయి. చేసిన పనులకుగాను విజయనగరం జిల్లాకు సంబంధించి ప్రస్తుతం రూ.28కోట్ల మేర బకాయి రావాల్సివుంది. అటు పార్వతీపురం మన్యం జిల్లాలోనూ రూ.10కోట్ల వరకు విడుదల కావాల్సి వున్నట్టు సమాచారం.

నిర్మాణం మధ్యలో నిలిచిపోయిన సచివాలయ భవనం

- రూ.28 కోట్ల మేర బకాయి
- మరో రూ.100కోట్లు ఉంటే తప్ప పూర్తికాని పరిస్థితి
- మంజూరుకు నోచుకోనివి మరికొన్ని
- ఇదీ ఐదేళ్ల పాలనలో మెటీరియల్ కాంపొనెంట్ నిధుల వినియోగం

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

జాతీయ గ్రామీణ ఉపాధి హామీలో భాగంగా ఏటా చేపడుతున్న పనిదినాలు, వాటిపై విడుదల అవుతున్న నిధులపై కొంతశాతం మెటీరియల్ కాంపొనెంట్ పనులకు కేటాయించాల్సి ఉంది. వైసిపి అధికారంలోకి వచ్చాక గ్రామ సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, విలేజ్ హెల్త్ క్లీనిక్‌లు వంటి వ్యవస్థలు ప్రవేశపెట్టిన సంగతి తెలిసిందే. మెటీరియల్ కాంపొనెంట్ నిధులతో ఆయా భవనాలు నిర్మాణానికి మొదటి ప్రాధాన్యతగాను, రోడ్లకు రెండో ప్రాధాన్యతగాను ఖర్చుచేసేందుకు నిర్ణయించింది. రెండో ప్రాధాన్యతకు పెద్దగా నిధులు మంజూరు చేయకపోవడంతో గ్రామీణ రహదారులు అస్తవ్యస్థంగానే ఉన్నాయి.

జిల్లా వ్యాప్తంగా 530 గ్రామ సచివాలయాలు ఉండగా వీటిలో 498 సచివాలయ భవనాలు, 496 రైతు భరోసా కేంద్రాలకుగాను 291 భవనాలు, 311 వెల్‌నెస్ సెంటర్లకుగాను 178 పూర్తి భవనాలు నిర్మించాలని 2019లోనే ప్రభుత్వం లక్ష్యంగా తీసుకుంది. ఉపాధి కూలీలు చేస్తున్న పని, వాటికి చెల్లింపులను బట్టి విజయనగరం జిల్లాలో సుమారు రూ.300కోట్లకుపైగా మెటీరియల్ కాంపొనెంట్ నిధులు విడుదల చేయాలి. కానీ, అరకొరగా విడుదల చేయడం వల్ల మిగిలిన నిధులు రద్దుకావడంతోపాటు చేసిన పనులకు బిల్లులు రాక, సంబంధిత భవన నిర్మాణాల కాంట్రాక్టర్లు పనులు మధ్యలోనే నిలిపివేయాల్సిన దుస్థితి ఏర్పడింది. పై లెక్కలను బట్టి ఇప్పటి వరకు కేంద్రం నుంచి రూ.1500కోట్ల మేర విడుదల చేయాల్సి వున్నప్పటికీ, గ్రామ సచివాలయాలకు రూ.130కోట్లు, రైతు భరోసా కేంద్రాలకు రూ.60కోట్లు, విలేజ్ హెల్త్‌క్లీనిక్ భవనాలకు రూ.50కోట్ల చొప్పున కేవలం రూ.240కోట్లు మాత్రమే విడుదల చేసింది. వీటికి సంబంధించి రూ.28కోట్ల మేర బకాయి ఉన్నట్టు అధికారులు చెబుతున్నారు. మొత్తం పనులు పూర్తికావాలంటే మరో రూ.100కోట్ల వరకు అవసరమని సమాచారం. దీంతో, 123 గ్రామ సచివాలయాలు, 126 రైతు భరోసా కేంద్రాలు, 133 విలేజ్ హెల్త్ క్లీనిక్‌లు చొప్పున మొత్తం 382 భవన నిర్మాణాలు రూఫ్‌లెవెల్, గోడలు, పునాదుల స్థాయిలో నిలిచిపోయాయి. చాలా వరకు ఏళ్ల తరబడి మొండిగోడలతో వెక్కిరిస్తున్నాయి. మరో 32 గ్రామ సచివాలయాలు, 79ఆర్‌బికెలు, 124 విలేజ్ హెల్త్‌క్లీనిక్‌ల చొప్పున ఈ మూడు విభాగాలకు చెందిన 235 భవనాలకు కనీసం ప్రతిపాదనలు కూడా లేవు.

పార్వతీపురం జిల్లా వ్యాప్తంగా 311 గ్రామ సచివాలయ భవనాలకు గానూ, 253భవనాల పనులు ప్రారంభించగా, 125 భవనాలు మాత్రమే పూర్తయ్యాయి. మిగిలినవి వివిధ దశల్లో ఉన్నాయి. 301 ఆర్‌బికె భవనాలకు గాను, 178 నిర్మాణాలు చేపట్టగా, 100 మాత్రమే పూర్తయ్యాయి. 192 విలేజ్ క్లీనిక్ భవన సముదాయాలు చేపట్టగా ఇందులో చాలా వరకు అసంపూర్తిగా ఉన్నాయి. మొత్తం భవన నిర్మాణాలకు సంబంధించి రూ.10కోట్ల వరకు బకాయి ప్రభుత్వం నుంచి రావాల్సివున్నట్టు సమాచారం. ఈ రెండు జిల్లాల్లో సచివాలయ, ఆర్‌బికె, విలేజేజ్ హెల్త్ క్లీనిక్ భవన నిర్మాణాల బకాయిలు సంక్రాంతిలోపే చెల్లిస్తామని, పనులు ముమ్మరం చేయాలంటూ జిల్లాకు చెందిన రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ పంచాయతీరాజ్ శాఖ అధికారులకు హామీ ఇచ్చినప్పటికీ, ఆ మాట ప్రకారం నిధులు ఇప్పటికీ విడుదల కాలేదు.

ప్రజా ఉద్యమాలకు విరాళాలు ఇవ్వండి

సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వై.వెంకటేశ్వరరావు

ప్రజాశక్తి-బొబ్బిలి

ప్రజా సమస్యలపై సిపిఎం నిర్వహిస్తున్న ప్రజా ఉద్యమాలకు విరాళాలిచ్చి అండగా నిలవాలని ఆపార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వై.వెంకటేశ్వరరావు కోరారు. పట్టణంలో ఆదివారం సిపిఎం నాయకులు విరాళాలు సేకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రజలు, కార్మికులు, రైతులు, అసంఘటిత రంగ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి సిపిఎం నిరంతరం పోరాటాలు చేస్తోందన్నారు. కేంద్రంలో బిజెపి, రాష్ట్రంలో వైసిపి పాలనలో అన్ని వర్గాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. నిత్యావసర సరుకుల ధరలు, పెట్రోల్, డీజిల్ ధరలు, విద్యుత్ ఛార్జీలు పెరగడంతో అన్ని వర్గాల ప్రజలపై భారాలు పడుతున్నాయన్నారు. ఆస్తిపన్ను, చెత్తపన్ను వంటి భారాలు వేస్తున్నారన్నారు. అన్ని రంగాల సమస్యలు పరిష్కారానికి సిపిఎం నిరంతరం పని చేస్తోందన్నారు. కార్పొరేట్ సంస్థలు ఇచ్చే ఎలక్ట్రోల్ బాండ్లను తీసుకోకూడదని సిపిఎం తీర్మానం చేసి ఎన్నికల కమిషన్‌కు కూడా తెలియజేసినట్లు చెప్పారు. ప్రజా సమస్యలపై పని చేస్తున్న సిపిఎంకు ప్రజలు, ఉద్యోగులు, వ్యాపారాలు స్వచ్ఛందంగా విరాళాలు ఇచ్చి సహకరించాలని కోరారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ, జిల్లా కార్యవర్గ సభ్యులు పి.శంకరరావు, బొబ్బిలి, రామభద్రపురం, బాడంగి మండలాల కార్యదర్శులు ఎస్.గోపాలం, బలస శ్రీనివాసరావు, సురేష్ పాల్గొన్నారు.

విరాళాలు అభ్యర్థిస్తున్న సిపిఎం నేతలు వైవి, తమ్మినేని

ప్రజా పోరాటాలను బలపర్చండి

నెల్లిమర్ల : సిపిఎం నిర్వహిస్తున్న ప్రజా ఉద్యమాలను ప్రజలంతా బలపర్చాలని రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వై.వెంకటేశ్వర రావు పిలుపునిచ్చారు. జరజాపు పేటలో సిపిఎం పార్టీ నిధుల సేకరణ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మిక, కర్షక, ఉద్యోగుల, ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా సిపిఎం పోరాటాలు, ఉద్యమాలు చేస్తుంది కాబట్టి అన్ని వర్గాల ప్రజలు విరాళాలు ఇచ్చి సహకరించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి తమ్మినేని సూర్య నారాయణ, సిపిఎం నాయకులు టివి రమణ, కె.రామారావు తదితరులు పాల్గొన్నారు.

మే 19, 20, 21న గొల్లపల్లి దాడితల్లి పండగ

ప్రజాశక్తి-బొబ్బిలి

గొల్లపల్లి దాడితల్లి గ్రామదేవత పండుగను మే 19, 20, 21న నిర్వహించేందుకు ఉత్సవ కమిటీ నిర్ణయించింది. మార్చి 25న అమ్మవారిని తెచ్చేందుకు, ఏప్రిల్ 21న సిరిమాను చెట్టు కొట్టేందుకు నిర్ణయించారు. మే 19న దేశతల్లి ఉత్సవం, 20న తొలేళ్ల ఉత్సవం, 21న సిరిమానోత్సవం నిర్వహించనున్నారు.

షటిల్ ఆడుతున్న ఎమ్మెల్సీ రఘురాజు

ఉత్సాహంగా షటిల్ పోటీలు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ ఇండోర్ స్టేడియంలో ఆదివారం జిల్లా స్థాయి మాస్టర్స్ షటిల్ బాడ్మింటన్ టోర్నమెంట్ , ఎంపిక పోటీల ను జిల్లా బాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షులు, ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ 35ఏళ్ల వయసు నుండి 75ఏళ్ల వయసు గల పురుషులకు , మహిళలకు 9 కేటగిరీలలో జిల్లా స్థాయి వెటరన్ షటిల్ బాడ్మింటన్ ఛాంపియన్‌షిప్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పోటీలలో విజయనగరం జిల్లాలో అన్ని నియోజకవర్గాల నుంచి క్రీడాకారులు పాల్గొంటున్నారన్నారు, ప్రతిభ కనబరచిన క్రీడాకారులకు ప్రసంశాపత్రాలు అందజేసి, మార్చిలో 3 రోజులపాటు రాజమండ్రిలో జరగబోయే రాష్ట్రస్థాయి వెటరన్ షటిల్ బాడ్మింటన్ ఛాంపియన్‌షిప్ లో జిల్లా తరపున ప్రాతినిధ్యం వహించే అవకాశం కలుగుతుందన్నారు. కార్యక్రమంలో, అసోసియేషన్ ఉపాధ్యక్షులు ఎమ్‌కెబి శ్రీను, కార్యదర్శి వై.కె.బచ్చన్, సహాయ కార్యదర్శి నున్న సురేష్, మీడియా ఇంఛార్జి ఎస్.మల్లిఖార్జునరావు, జిల్లా నలుమూలల నుండి వచ్చిన మాస్టర్స్ క్రీడాకారులు, తదితరులు పాల్గొన్నారు.

సంబరాలు సరే.. డబ్బులేవీ?

ఆసరా డబ్బుల కోసం బ్యాంకుల చుట్టూ మహిళల ప్రదక్షిణలు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

మహిళలను మహారాణులను చేస్తామంటూ.. వైఎస్‌ఆర్ ఆసరా పేరుతో బ్యాంకులో తీసుకున్న రుణాలను మాఫీ చేస్తూ.. నాలుగు విడతల్లో స్వయం సహాయక సంఘాల మహిళల ఖాతాల్లో జమ చేస్తామని ప్రభుత్వం ప్రకటించింది. 2019 ఏప్రిల్ 17వ తేదీ వరకు స్వయం సహాయ సంఘాలు బ్యాంకు ద్వారా తీసుకున్న రుణాన్ని మాఫీ చేస్తానని ప్రతిపక్ష నేతగా జగన్ మోహన్ రెడ్డి హామీ ఇచ్చారు. ఈ మేరకు అధికారంలోకి వచ్చిన తరువాత స్వయం సహాయక సంఘాల మహిళలు బ్యాంకులో తీసుకున్న రుణాన్ని నాలుగు విడతలకు గాను మూడుసార్లు బ్యాంకుల్లో నగదు జమచేశారు. జగన్ ప్రభుత్వం హామీ మేరకు నాలుగో విడత వైఎస్‌ఆర్ ఆసరా కింద నిధులను గత నెల 23న అనంతపురం జిల్లా ఉరవకొండలో భారీ బహిరంగ సభలో ముఖ్యమంత్రి స్వయంగా బటన్ నొక్కి, విడుదల చేస్తున్నట్లు ప్రకటించారు. అదే రోజు జిల్లాల వారీగా మంత్రులు స్వయం సహాయక సంఘాల మహిళలకు మెగా చెక్కులు అందజేశారు. అనంతరం మండలాల వారీగా ఆయా నియోజకవర్గ ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులు సభలు ఏర్పాటు చేసి, చెక్కులు పంపిణీ చేశారు. నాటి నుంచి నేటి వరకు స్వయం సహాయక సంఘాల మహిళలు ఆసరా డబ్బుల కోసం బ్యాంకుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు.



వైఎస్‌ఆర్ ఆసరా చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యేలు (ఫైల్)

20 రోజులైనా..

వైఎస్‌ఆర్ ఆసరా పథకంలో భాగంగా నాలుగో విడతలో జిల్లాలో 36,507 సంఘాల పరిధిలోని 4,04,031 మంది డ్వాక్రా మహిళలకు రూ.252.31 కోట్లు నిధులు విడుదల చేయాల్సి ఉంది. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి స్వయం సహాయక సంఘాల మహిళల వ్యక్తిగత ఖాతాల్లో ఆ డబ్బులు జమచేస్తున్నట్లు జనవరి 23న బటన్ నొక్కారు. జిల్లాలో ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులు సమావేశాలు ఏర్పాటు చేసి జగన్ ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం నాలుగు విడతల్లో డ్వాక్రా రుణాలు మాఫీ చేశారంటూ గొప్పలు చెప్పుకున్నారు. డబ్బులు మాత్రం మహిళల ఖాతాల్లో జమకాక స్వయం సహాయక సంఘాల మహిళలు బ్యాంకుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. ఆసరా పేరిట ప్రభుత్వం ఇచ్చిన రుణమాఫీ పొందేందుకు బ్యాంకు వరకు వచ్చే పోయేందుకు మూణ్నాలుగు వందల రూపాయలు ఖర్చు చేయాల్సి వస్తోందని అక్కచెల్లెమ్మలు వాపోతున్నారు. విజయనగరం నగరంలో 3406 డ్వాక్రా గ్రూపుల్లో ఉన్న 33,383 మందికి, నాలుగో విడత రుణమాఫీ కింద రూ.25.8 కోట్లు విడుదల కావాల్సి ఉంది. నేటికీ 20 శాతం దాటి రాలేదని సంఘాల మహిళలు వాపోతున్నారు దీంతో ఎన్నికల కోడ్ అమల్లోకి వస్తే ప్రభుత్వ రుణమాఫీ డబ్బులు బ్యాంకు ఖాతాల్లో జమచేస్తారా? లేదా అనే సందేహాలు వ్యక్తం చేస్తున్నారు.

మాక్ టెస్ట్ రిజిస్ట్రేషన్ గడువు పొడిగింపు

విజయనగరం టౌన్ : ధీరా ఫౌండేషన్ నిర్వహిస్తోన్న ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ గ్రూప్ -2 మాక్ టెస్టు రిజిస్ట్రేషన్ గడువు తేదీని పొడిగిస్తున్నట్టు ఆ ఫౌండేషన్ అధినేత డాక్టర్ బొత్స సందీప్ ఒక ప్రకటనలో తెలిపారు. గ్రూప్స్ పరీక్షలకు సిద్ధమవుతున్న అభ్యర్థులలో అత్యధికులు పరీక్ష గడువును పొడిగించాల్సిందిగా కోరడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. www.dheera foundatn.com వెబ్ సైట్ లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని ఆయన పిలుపు నిచ్చారు. ఉత్త రాంధ్ర లోని ప్రధాన పట్టణాలలో జరుపబోయే గ్రూప్ 2 మాక్ టెస్టు ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ చేసుకున్న వారికి ఎస్ ఎం ఎస్, వాట్సాప్ సందేశాల ద్వారా వివరాలు పంపిస్తామని ఆయన తెలిపారు. పరీక్షకు హాజరయ్యే వారికి డిజిటల్ కాంపిటేటివ్ మెటీరియల్ ఉచితంగా అందజేస్తామని పేర్కొన్నారు.

ప్రెస్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా పుస్తకావిష్కరణ

విజయనగరం టౌన్ : భారతీయ భాషల పునరుద్ధరణకు పరిశోధనలు విస్తత స్థాయిలో జరగాలని, ఈ దశలో పత్రికల పాత్ర ఎంతో ముఖ్యమని కేంద్రీయ గిరిజన విశ్వ విద్యాలయం వైస్ ఛాన్సలర్ ఆచార్య టివి కట్టిమణి అన్నారు. ప్రస్తుత కాలంలో ప్రెస్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ఆవశ్యకతపై డాక్టర్ బొండా రామకృష, డాక్టర్ చల్లా కృష్ణవీర్ అభిషేక్ రాసిన 'ప్రెస్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా, ఇట్స్ రిలవెన్సెస్ అనే పరిశోధన పుస్తకాన్ని ఆయన ఆదివారం ఆవిష్కరించారు. ఆంధ్ర విశ్వవిద్యాలయం జర్నలిజం ప్రొఫెసర్ చల్లా రామకృష్ణ పర్యవేక్షణలో ఈ పరిశోధన జరిగింది. అంతరించిపోతున్న గిరిజన భాషల పునర్జీవనానికి సెంటర్ ఫర్ ఎమోషనల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ డాక్టర్ కృష్ణ వీర్ అభిషేక్ చేస్తున్న కృషిని కట్టిమని అభినందించారు. కార్యక్రమంలో రామకష్ణ, అభిషేక్ పాల్గొన్నారు.



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న సిటియు విసి కట్టిమణి

నూతన రహదారులు ప్రారంభం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

నగరంలోని 4,5 డివిజన్లలో వివిధ అభివృద్ధి పనులను ఆదివారం డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి ప్రారంభించారు. బాబా మెట్టలోని ద్వారకా నగర్ లోనూ, కొత్తపేట లోని విజయలక్ష్మి నగర్‌లోనూ నూతనంగా ఏర్పాటు చేసిన రహదారులను ప్రారంభించి ప్రజా వినియోగంలోకి తీసుకొచ్చారు. ఈ సందర్భంగా ఆయా డివిజన్లకు కార్పొరేటర్లు గాదం మురళి, మారోజు శ్రీనివాసరావు, వైసిపి నాయకులు గదుల సత్యలత, వీర్రాజు మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా అపరిష్కృతంగా ఉన్న సమస్యలను పరిష్కరిస్తూ డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి నగర అభివృద్ధే ధ్యేయంగా కషి చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో మేయర్ విజయలక్ష్మి, ఫ్లోర్ లీడర్ ఎస్ వివి రాజేష్, కెఎపి రాజు తదితరులు పాల్గొన్నారు.

నూతన అన్నదాన భవనం ప్రారంభం

ఆర్య వైశ్యుల ఆరాధ్యదైవం శ్రీ వాసవీ కన్యకాపరమేశ్వరి అవతరించిన రోజును ఆదివారం దేవస్థానం అధ్యక్షులు నారాయణం శ్రీనివాస్ పర్యవేక్షణలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక అభిషేక అర్చన కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఉపసభాపతి కోలగట్ల వీరభద్రస్వామి పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం దేవాలయం మేడపై నూతన అన్నదాన భవనాన్ని కోలగట్ల ప్రారంభించారు. కార్యక్రమంలో రవ్వా శ్రీనివాస్, జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు కుమ్మరిగుంట శ్రీనివాసరావు, వెత్సా సత్యనారాయణమూర్తి, కోశాధికారి విజ్జపు వెంకట శ్రీనివాసరావు, ఉసిరికల చంద్రశేఖర్, ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షులు కాపుగంటి ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

నూతన రహదారిని ప్రారంభిస్తున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల

92 శాతం పని దినాలు పూర్తి

- రూ.401.35 కోట్ల మేర వేతనాలు
- ఫిబ్రవరి నెలాఖరికి లక్ష్యానికి చేరువ
- పంచాయతీల్లో పనులకు సాంకేతిక సమస్యలు
- ఐదేళ్లలో 373 బోర్లు
- 'ప్రజాశక్తి'తో డ్వామా పీడీ ఉమాపరమేశ్వరి ముఖాముఖి

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

జాతీయ గ్రామీణ ఉపాధి హామీలో భాగంగా కార్డుదారులందరికీ ఇప్పటి వరకు 92శాతం పని దినాలు పూర్తి చేశామని డ్వామా ప్రాజెక్టు డైరెక్టర్ ఉమాపరమేశ్వరి తెలిపారు. వీటిలో జనవరి 11వ తేదీ వరకు చేసిన పనులకు సంబంధించి రూ.401.35కోట్ల మేర కూలీల ఖాతాల్లో వేతనాలు జమచేశామని అన్నారు. ఫిబ్రవరి ఆఖరునాటికి లక్ష్యానికి మించి ఉపాధి పనులు కల్పిస్తామని ధీమా వ్యక్తం చేశారు. సాంకేతిక సమస్యలు తలెత్తిన కొన్ని పంచాయతీల్లో మినహా మిగిలిన అన్నిచోట్లా పనులు ముమ్మరంగా సాగుతున్నాయని వివరించారు. వైఎస్‌ఆర్ జలకళ పథకంలో భాగంగా గడిచిన ఐదేళ్లలో 373బోర్లు ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. ఈ వారం కలిసిన ప్రజాశక్తికి పీడీ ముఖాముకి ఇంటర్వ్యూ ఇచ్చారు. వివరాలు ఆమె మాటల్లోనే.....

ఇప్పటి వరకు ఎన్ని పనిదినాలు కల్పించారు?

ఈ ఏడాది ఇప్పటి వరకు జిల్లాలో 1.82కోట్ల పనిదినాలు కల్పించాలని లక్ష్యంగా పెట్టుకోగా సుమారు 1.67లక్షల పనిదినాల వరకు కల్పించాం. దాదాపు 92శాతం పనిదినాలు కల్పించినట్టు లెక్క. జనవరి 11 నాటికి పూర్తయిన పనులకుగాను రూ.401.35కోట్ల మేర కూలీల ఖాతాల్లో జమయ్యింది. ఈనెలాఖరు నాటికి పనిదినాలు కల్పించడంలో లక్ష్యాన్ని చేరుకుంటాం. గత ఆర్థిక సంవత్సరంలో 1.97కోట్ల పనిదినాలు కల్పించగా, సుమారు రూ.490కోట్ల వరకు కూలీల బ్యాంకు ఖాతాల్లో జమ అయ్యాయి.

ప్రస్తుతం ఉపాధి పనులు జరుగుతున్నాయా?

జిల్లా వ్యాప్తంగా 6.80లక్షల జాబ్‌కార్డులు ఉన్నాయి. ఇందులో సాంకేతికలోపం వల్ల కొత్తగా ఏర్పడిన కొన్ని పంచాయతీల్లో 2,871 మందికి మూడు నెలలుగా పని కల్పించడం సాధ్యం కాలేదు. మిగిలినవారంతా పనులు చేసుకుంటున్నారు. ప్రస్తుతం పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. సంక్రాంతి తరువాత నుంచి పనులు క్రమంగా పుంజుకున్నాయి. రోజూ 1.2లక్షల పనిదినాలను కూలీలు ఉపయోగించుకుంటున్నారు. ప్రతి 15రోజులకు చెల్లింపులు జరుగుతున్నాయి. ఈ ఆర్థిక సంవత్సరం ముగిసేనాటికి లక్ష్యానికి మించి ఉపాధి పనులు కల్పిస్తామన్న ధీమా ఉంది.

ఆధార్ బేస్డ్ పేమెంట్ ఎంత వరకు వచ్చింది?

ఉపాధి కూలీలకు ఆధార్ బేస్డ్ పేమెంట్ సిస్టమ్ విధానం కేంద్ర ప్రభుత్వం కొత్తగా అమల్లోకి తెచ్చింది. మన రాష్ట్రంలోనూ, జిల్లాలో ఈ ఏడాది జనవరి 1నుంచి అమలవుతుంది. జిల్లాలో అందరికీ ఆధార్ నెంబర్ ద్వారానే కూలి సొమ్ము వారి బ్యాంకు ఖాతాల్లో జమ అవుతున్నాయి. జనవరి నెలకు ముందుగానే మూడు నెలలపాటు స్పెషల్ డ్రైవ్ నిర్వహించి జాబ్‌కార్డులకు ఆధార్ లింకు చేయడం జరిగింది.

కొన్ని పంచాయతీల్లో పనులు నిచిపోవడానికి కారణం ఏమిటి?

కొత్తగా ఏర్పాటైన కొన్ని పంచాయతీల్లో గత ఏడాది నవంబర్ నుంచి ఉపాధి పనులు నిలిచిపోయాయి. ఆయా పంచాయతీలకు ఎల్‌జిడి (లోకల్ గవర్నమెంట్ డైరెక్టరేట్) కోడ్ రూపొందించలేదు. ఆ కోడ్ ఉంటే తప్ప ఎన్‌ఐసి సాఫ్ట్‌వేర్‌లో ఆయా గ్రామ పంచాయతీలకు సంబంధించిన పనులు ప్రతిపాదించడం, ప్రభుత్వం నుంచి ఆమోదం పొందడం సాధ్యం కాదు. ఆ సమస్య పరిష్కారానికి జిల్లా కలెక్టర్ ద్వారా ఇప్పటికే సిసిఎల్‌ఎ కమిషనర్, పంచాయతీరాజ్ కమిషనర్‌ల దృష్టికి తీసుకెళ్లాం. త్వరలోనే పరిష్కారమౌతుందని ఆశిస్తున్నాం.

ఉపాధి పనులు నిలిచిపోయిన గ్రామాలు ఎన్ని? వాటిపేర్లు ఏమిటి?

ఎల్‌జిడి కోడ్ సాంకేతిక వల్ల జిల్లాలో మొత్తం 11 గ్రామ పంచాయతీల్లో ఉపాధి పనులు నిలిచిపోయాయి. పనులు నిలిచిపోయిన వాటిలో మెరకముడిదాం మండలం నరసయ్యపేట, ఎం.గదబవలస, గుర్ల మండలం ముద్దాడపేట, రౌతువలస, కేశవుపేట, నెల్లిమర్ల మండలం పెదబూరాడపేట, మెంటాడ మండలం చింతాడవలస, విజయనగరం మండలం బడుకొండపేట, సుంకరిపేట, చిల్లపేట, గుండాలపేట ఉన్నాయి.

జలకళ బోర్లు ఎన్నివేశారు?

వైఎస్‌ఆర్ జలకళ పథకం ద్వారా బోర్లు వేసుకునేందుకు జిల్లా వ్యాప్తంగా సుమారు 6వేల దరఖాస్తులు అందాయి. వీటిలో 373బోర్లు వేశాం. సంబంధిత కాంట్రాక్టర్ మధ్యలో వెనక్కి తగ్గడం వల్ల మిగిలిన రైతులకు వేయాల్సిన బోర్లు పెండింగ్‌లో వున్నాయి. ప్రభుత్వం నుంచి సంబంధిత కాంట్రాక్టర్‌తో సంప్రదింపులు జరుగుతున్నట్టు తమ ఉన్నతాధికారులు చెబుతున్నారు.

సెకెండ్ క్లాస్ మెజిస్ట్రేట్‌గా అప్పలనాయుడు

ప్రజాశక్తి-శృంగవరపుకోట

గండి అప్పలనాయుడు

శృంగవరపుకోట కోర్టు సెకెండ్ క్లాస్ మెజిస్ట్రేట్‌గా గండి అప్పలనాయుడు సోమవారం బాధ్యతలు స్వీకరించనున్నారు. ఈ సందర్భంగా ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ ఏడాది క్రితం వరకు ఇదే కోర్టులో సెకెండ్ క్లాస్ మెజిస్ట్రేట్‌గా పని చేశానని తెలిపారు. మరో రెండేళ్ల పాటు తనను నియమిస్తూ హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసిందని వివరించారు.

బొండపల్లి తహశీల్దార్‌గా హనుమంతురావు

ప్రజాశక్తి-బొండపల్లి

బొండపల్లి తహశీల్దార్‌గా ఎన్.హనుమంతురావు ఆదివారం బాధ్యతలు చేపట్టారు. విజయనగరం ఆర్‌డిఒ కార్యాలయంలో ఎఒగా విధులు నిర్వహిస్తున్న హనుమంతురావు బదిలీపై బొండపల్లి వచ్చారు. బాధ్యతలు చేపట్టిన ఆయనకు రెవెన్యూ సిబ్బంది, విఆర్‌ఒలు శుభాకాంక్షలు తెలిపారు.

గ్రామీణ బంద్‌ను జయప్రదం చేయాలి

ప్రజాశక్తి-నెల్లిమర్ల

ఈ నెల 16న జరిగే గ్రామీణ భారత్ బంద్‌ను జయప్రదం చేయాలని ప్రజాసంఘాల నాయకులు పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక అమర కార్మిక భవనంలో గ్రామీణ భారత్ బంద్ కరపత్రాలను కిల్లంపల్లి రామారావు, మొయిద పాపారావు, కాళ్ళ అప్పల సూరి, కనకల పద్మనాభం విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కార్మిక, కర్షక, ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా గ్రామీణ భారత్ బంద్ చేపడుతున్నట్లు తెలిపారు.

ఎపిఎంఎస్‌ఆర్‌యు రాష్ట్ర సహాయ కార్యదర్శిగా రవికుమార్

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

యుఎస్ రవికుమార్

ఆంధ్రప్రదేశ్ మెడికల్ సేల్స్ రిప్రంజటేటివ్స్ యూనియన్ రాష్ట్ర సహాయ కార్యదర్శిగా జిల్లాకు చెందిన యుఎస్ రవికుమార్ ఎన్నికయ్యారు. ఈ మేరకు విజయవాడలో జరిగిన మహాసభల్లో ఆయనను ఎన్నుకున్నారు.

ఇళ్ల పట్టాలు పంపిణీ మోసం కాదా?

టిడిపి రాష్ట్ర కార్యదర్శి గొంప కృష్ణ

ప్రజాశక్తి-వేపాడ

గొంప కృష్ణ

ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో ఇళ్ల పట్టాలు పంపిణీ చేయడం మోసం కాదా? అని టిడిపి రాష్ట్ర కార్యదర్శి గొంప కృష్ణ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. మండలంలోని అంకాజోష్యులపాలెంలో తన నివాసం వద్ద ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఎన్నికలు నోటిఫికేషన్ వెలువడే సమయంలో ఇంటి స్థలాలు మంజూరు చేయడమేమిటని నిలదీశారు. లక్షల ఇళ్లు నిర్మించామని, ఊళ్లకు ఊళ్లే ఏర్పాటు అవుతున్నాయని గొప్పలు చెప్పుకోవడమే తప్ప ఎక్కడా పూర్తిగా జగనన్న గృహ నిర్మాణాలు జరగలేదన్నారు. భూమి కొనుగోలు, చదును చేయడం పేరుతో ప్రజా ధనం దోచుకోవడం తప్ప అందులో పేదలకు వచ్చే ప్రయోజనం ఏమీ లేదన్నారు. జగ్గయ్యపేటలో చెరువు గర్భాన్ని, పికెఆర్‌పురం గెడ్డ, ముకుందపురంలో రాళ్లగుట్టలను చదును చేసి, ఇళ్ల స్థలాలు ఇవ్వడమే అందుకు నిదర్శనమన్నారు. ఎన్నికలు సమీపిస్తున్న సమయంలో నిర్మాణానికి ఇంటి స్థలాలు ఇవ్వడం మోసం కాదా? అని ప్రశ్నించారు. ఇప్పటికైనా మాయమాటలు చెప్పడం మానుకోవాలని హితవుపలికారు.

తూముల కార్తీక్‌ను సన్మానిస్తున్న రోటరీ సభ్యులు

నాయకత్వ లక్షణాలు పటిష్టం కావాలి

ప్రజాశక్తి-బొబ్బిలి

పటిష్టమైన నాయకత్వం తోనే అంతర్జాతీయ రోటరీ సంస్థ శక్తివంతంగా సమాజానికి సేవలందించగలదని రోటరీ డిస్ట్రిక్ట్ 3020 డిజిఇ డాక్టర్ వెంకటేశ్వర రావు పిలుపునిచ్చారు. బొబ్బిలి రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో స్థానిక టిబిఆర్ కన్వెన్షన్ లో నిర్వహిస్తున్న రోటరీ డిస్ట్రిక్ట్ 2024 - 25 ఆరు జిల్లాల శిక్షణా సెమినార్ రెండవ రోజు ముగింపు కార్యక్రమాన్ని రోటరీ క్లబ్ అధ్యక్షులు జె సి రాజు, రీజినల్ చైర్ తూముల కార్తిక్ నిర్వహించారు. ఈ సెమినార్‌లో డాక్టర్ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ వెంకటేశ్వర రావు, భాస్కర రామ్, విశ్వనాధ్, జిల్లా కార్యదర్శి రవి మండ రోటరీ నాయకత్వం-పటిష్టం...ప్రపంచ సమస్యలు...రోటరీ పాత్ర, అనే విషయాలపై సెమినార్ ను నిర్వహించారు. అనంతరం పూర్వ జిల్లా గవర్నర్ లను బొబ్బిలి రోటరీ క్లబ్ సభ్యులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో రోటరీ సభ్యులు జె. ప్రవీణ్ ప్రవీణ్, సజ్జ అప్పల రాజు, శంకర రావు, చంద్ర మౌళి, కృష్ణ మోహన్, మురళి తదితరులు పాల్గొన్నారు.

సమాజ సేవలో యువత పాత్ర కీలకం

ప్రజాశక్తి-రేగిడి

సమాజసేవలో యువత కీలక పాత్ర వహించాలని జిఎంఆర్‌ఐటి సీనియర్ అసిస్టెంట్ ప్రొఫెసర్ అమూల్ బోటే, వైసిపి నాయకులు సూర్య బాబురావు, ఎన్‌ఎస్‌ఎస్ పిఒ కె వి ఎస్ ప్రసాద్ అన్నారు. ఈ మేరకు ఆదివారం జిఎంఆర్‌ఐటి ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో తాటిపాడు గ్రామంలో నిర్వహిస్తున్న ప్రత్యేక సేవా శిబిరంలో పచ్చదనం కార్యక్రమం నిర్వహించారు. ముందుగా గ్రామంలో చెట్లు పెంపకం వల్ల కలిగే ప్రయోజనాలను అవగాహన కల్పించారు. అనంతరం ఎన్‌ఎస్‌ఎస్ వాలంటీర్లు గ్రామంలో వివిధ ప్రాంతాల్లో మొక్కలు నాటారు. స్థానిక ప్రాథమికోన్నత పాఠశాల ఆవరణలో మొక్కలతో ప్రత్యేకంగా ఉద్యానవనం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో నాయకులు బూర రామ్మోహన్, హెచ్‌ఎం రాంబాబు, పిఇటి మురళి పాల్గొన్నారు.

రసవత్తరంగా ఎడ్ల పరుగు పోటీలు

ప్రజాశక్తి-వేపాడ

పరుగుపోటీలో పాల్గొన్న ఎడ్లబండి

మండలంలోని చిన్న గుడిపాల గ్రామంలో పరదేశమ్మ జాతర ముగింపు సందర్భంగా జిల్లాస్థాయి ఎడ్ల పరుగు ప్రదర్శన నిర్వహించారు. విజేతలకు నగదు బహుమతులను డిసిసిబి చైర్మన్ వేచలపు వెంకట రామినాయుడు, సర్పంచుల సంఘం మండల అధ్యక్షులు నిరుజోగి వెంకటరావు అందజేశారు.

గ్రంథాలయానికి పుస్తకాలు వితరణ

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

మదర్ థెరీసా సేవా సంఘం, బ్లడ్ డోనర్స్ క్లబ్ వ్యవస్థాపకులు-త్యాడ ప్రసాద్ పట్నాయక్ సుమారు రూ.5వేలు విలువచేసే కాంపిటేటివ్ పుస్తకాలను ఆదివారం బాలాజీ జంక్షన్లో గల నవ్యాంధ్ర ప్రజాగ్రంథాలయానికి అందజేశారు. ఈ సందర్భంగా జనవిజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షుడు ఎరుకొండ ఆనంద్ మాట్లాడుతూ, పేద విద్యార్థులకు ఎంతో ఉపయోగపడే ప్రజా గ్రంథాలయానికి పుస్తకాలు వితరణ చేయడం అభినందనీయమని పేర్కొన్నారు. కార్యక్రమంలో నవ్యాంధ్ర ప్రజా గ్రంథాలయ వ్యవస్థాపకులు పి.షణ్ముఖరావు, నాయీ బ్రాహ్మణ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు టివి దుర్గారావు, నవ్యాంధ్ర ప్రజా గ్రంథాలయం కార్యదర్శి ఇఎస్ఎన్ రాజు, మదర్ తెరిసా సేవా సంఘ సభ్యులు ఝాన్సీ, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సొంతింటి కల.. నెరవేరేదెలా?

- మూడేళ్లయినా పూర్తికాని జగనన్న కాలనీలు
- లేఅవుట్లకే పరిమితమైన వైనం
- కొన్ని గ్రామాల్లో స్థల సమస్య

సోమరాజుపేటలో లేఅవుట్ ఇదే..

ప్రజాశక్తి-రేగిడి

మండలంలోని 25 సచివాలయాల పరిధిలో 15 గ్రామాలకు సంబంధించి జగనన్న కాలనీలు మూడేళ్లు గడిచినా పూర్తికాలేదు. మండలంలో 368 లేఅవుట్లకు సంబంధించి 2,531 జగనన్న ఇళ్లకు లబ్ధిదారులను ఎంపిక చేశారు. వీరికి పట్టాలు అందజేశారు. ఇళ్ల పట్టాలు మంజూరు చేసి ఇచ్చినా కొన్ని గ్రామాల్లో పూర్తిగా నిర్మాణాలు చేపట్టలేదు. మరికొన్ని గ్రామాల్లో నిర్మాణాలు ప్రారంభించినా, అసంపూర్తిగానే దర్శనమిస్తున్నాయి. ఇంకొన్ని గ్రామాల్లో లేఅవుట్ ఇచ్చినా కోర్టు పెండింగ్‌తో కనీసం ఒక్క ఇల్లు కూడా నిర్మాణాలు చేపట్టలేని దౌర్భాగ్య స్థితిలో లబ్ధిదారులు ఉన్నారు. గత ప్రభుత్వాలు డి పట్టా భూములు ఇచ్చినా వాటిని రెవెన్యూ అధికారులు తిరిగి తీసుకొని లేఅవుట్లు వేశారు. డి-పట్టాదారులు కోర్టును ఆశ్రయించి స్టే తీసుకురావడంతో ఆ గ్రామాల్లో జగనన్న కాలనీలు పూర్తిగా నిలిచిపోయాయి. జగనన్న కాలనీ ఊరినే తలపిస్తుందన్న ప్రభుత్వ ఊకదంపుడు ప్రసంగాలు, ప్రకటనలే తప్ప ఆచరణలో శూన్యమని స్పష్టంగా కనిపిస్తుంది.

రేగిడి మండలంలోని గుల్లపాడు పంచాయతీ పరిధిలోని కొండలమామిడి వలసలో సర్వే నంబరు 1లో కొండపోరంబోకులో రేగిడి, ఆముదాలవలస, మజ్జిరాముడుపేట, అంబకండి, సంకిలితోపాటు మరో మూడు పంచాయతీలకు జగనన్న కాలనీలో ఇళ్లు మంజూరు చేశారు. 220 జగనన్న ఇళ్లకు 55 మాత్రమే పూర్తయ్యాయి. మిగిలిన 165 వివిధ స్థాయిల్లో నిర్మాణాల్లోనే ఉన్నాయి. కాగితాపల్లి పంచాయతీలో 24 గృహాలు మంజూరయ్యారు. గ్రామానికి దూరం కావడంతో లబ్ధిదారులు పూర్తిగా నిర్మాణాలు చేపట్టలేదు. సంకిలి గ్రామంలో సర్వే నంబరు 319లో 75 గృహాలు, 97లో సర్వే 38 గృహాలు మంజూరైనా ఇళ్ల నిర్మాణాలు ప్రారంభించలేదు. ఇక్కడ గతంలో ఎస్‌సి లబ్ధిదారునికి డి పట్టా ఇచ్చినప్పటికీ జీడి, మామిడి తోట తిరిగి తీసుకుని, జగనన్న కాలనీకి ఇవ్వడంతో వన్నలి జనార్దన కోర్టును ఆచరించడంతో స్టే విధించారు. సర్వే నంబరు 97లో నారు జనార్దన, పట్టాభిలకు చెందిన 25 ఏళ్లుగా హక్కుల ఉన్న స్థలంలో జగనన్న కాలనీకి కేటాయించారు. వీరు కోర్టును ఆశ్రయించడంతో స్టే విధించారు. ఖండ్యాంలో 18, వెంకటాపురం 20 గృహాలు కట్టలేదు. మునగలవలసలో తొమ్మిదింటికి నాలుగు నిర్మాణాలు చేపట్టలేదు. వెంకంపేటలో 11 గృహాలకు ఒకటి మాత్రమే పూర్తిచేశారు. తోకవలసలో 7, సరసనాపల్లిలో ఆరు, సోమరాజుపేట ఆరు గృహాలు మంజూరైనా పూర్తిగా నిర్మాణ పనులు ప్రారంభించలేదు. ఇలా చెప్పుకుంటూ పోతే 160 జగనన్న కాలనీల్లో గృహాలు పూర్తిగా ప్రారంభించలేదు.

మరోవైపు ఇంటి నిర్మాణానికి ప్రస్తుతం ప్రభుత్వం అందిస్తున్న రూ.1.80 లక్షలు ఇసుక, సిమెంటుకే చాలడం లేదని లబ్ధిదారులు వాపోతున్నారు. అది కూడా కొండ ప్రాంతంలో జగనన్న కాలనీకి స్థలం మంజూరు చేయడంతో సమాన ప్రాతిపదికన పునాదులకే ఐదు లక్షల రూపాయలు అవుతుందని లబ్ధిదారులు ఆవేదన చెందుతున్నారు. గతంలో ప్రభుత్వమే జగనన్న కాలనీలో ఇళ్లు నిర్మిస్తుందని చెప్పి, వెనుకడుగు వేయడంపై లబ్ధిదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నిర్మాణాలు పూర్తయిన జగనన్న కాలనీలకు రహదారులు, తాగునీరు, విద్యుత్ సమస్య ఉందని చెబుతున్నారు.

జాప్యం వాస్తవం

జగనన్న కాలనీల ఏర్పాటులో జాప్యం వాస్తవం.. కాలనీల నిర్మాణాల వేగవంతానికి చర్యలు తీసుకుంటాం. కొన్ని చోట్ల లబ్ధిదారులకు అవగాహన కల్పించినా ముందుకు రావడం లేదు. ఇళ్ల నిర్మాణంలో జిల్లాలో రేగిడి మండలం ముందంజలో ఉంది. స్థానిక ప్రజాప్రతినిధులతో సమావేశం ఏర్పాటు చేసి నిర్మాణాలు వేగవంతం చేసేందుకు కృషి చేస్తాం.

- జగన్నాథరావు, హౌసింగ్ ఎఇ

సాహితీ లోకానికి మాస్టారు.. కారా

కారా మాస్టారు కథలతో కొద్దిసేపు ముచ్చట్లలో కవులు, రచయితలు

మాట్లాడుతున్న గంటేడ గౌరినాయుడు

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

'భగవంతుడికి జనం నమస్కరిస్తారు. ఆ భగవంతుడు మనిషిగా మారితే అప్పుడు కూడా అందరూ అతనికి నమస్కరిస్తారని అందరికీ తెలిసిన విషయమే. అయితే, దేముడు మానవుడైతే అప్పుడు అతనైనాసరే కాళీపట్నం రామారావుకు నమస్కరించి తీరవలసిందే!. రామారావు గారి వంటి సజ్జనుడి సాంగత్యం లభించడం నా అదృష్టం. ఆయన లాంటి గొప్ప కథకులుండటం మన జనం అదృష్టం.' అంటూ రాచకొండ విశ్వనాధశాస్త్రి, యజ్ఞం కథాసంపుటి ముందు మాటగా 1971లో రాసారని సాహితీ ప్రముఖులు, కవులు, రచయితలు తెలిపారు. నేటి ఆధునిక కాలంలో కారా మాస్టారు రచనలు సాహితీ ప్రపంచానికి దిక్సూచని, సాహితీ లోకంలో అందరికీ మాస్టారు కారా మాస్టారు అని కొనియాడారు.

ఆదివారం పార్వతీపురంలో స్నేహకళాసాహితీ ఆధ్వర్యంలో కారా మాస్టారి కథలతో కొంతసేపు సాహితీ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. కథా దీపధారి కాళీపట్నం రామారావు మాస్టారు శతజయంతి సంవత్సరం, కథానిలయం వార్షికోత్సవ సందర్భంగా ఉత్తరాంధ్రలో అన్నిచోట్ల ఆదివారం సాహితీ సమావేశాలు జరగ్గా పార్వతీపురంలోని గిరిజన్ భవన్ లో సాహితీవేత్త గోపాలరావు అధ్యక్షతన లీ కార్యక్రమం జరిగింది. ప్రముఖ రచయిత గంటేడి గౌరీ నాయుడు, ఆముదాలవలస సాహితీ స్రవంతికి చెందిన పివిఎన్ మూర్తి, సహజ సాహితీ సాంస్కృతిక సంస్థకు చెందిన ఎన్‌కె బాబు, శ్రీకాకుళం సిక్కోలు బుక్ ట్రస్టుకు చెందిన రచయిత, వక్త దుప్పల రవికుమార్, రాజాం రచయితల సంఘానికి చెందిన రచయిత పొదిలాపు శ్రీనివాసరావు మాట్లాడుతూ కారామాస్టారి సాహిత్యాన్ని, వ్యక్తిత్వాన్ని, నిబద్ధతను వివరించారు. రచయిత, కథకుడు, విమర్శకుడయిన కారా మాస్టారు రచనలశైలి సరళంగా ఉంటుందన్నారు. ఆయనరాసిన యజ్ఞం ఆధునిక తెలుగు సాహిత్యంలో కన్యాశుల్కంతో సమానమైనదన్నారు. కారా భౌతికంగా లేకపోయినా ఆయన కథలు, రచనలు, ఆయన ఏర్పాటుచేసిన కథానిలయం చిరకాలం ఉంటాయని తెలిపారు. తెలుగులో ప్రపంచస్థాయిలో ప్రచురించిన కథలు, సాహిత్యం ఆయన ఏర్పాటు చేసిన కథానిలయంలో శాశ్వతంగా ఉంటాయని తెలిపారు. శ్రీకాకుళం జిల్లాల్లోని మురపాకలో పుట్టి విశాఖలో లెక్కల మాస్టారుగా పనిచేసిన కారామాస్టారు సాహితీ ప్రపంచంలో అందరికీ మాస్టారని తెలిపారు. కార్యక్రమంలో రచయితలు శాంతి, కుమార్ వర్మ, జగదీష్, పక్కి రవీంద్ర, స్వామి నాయుడు, చిన్నంనాయుడు, సోమేశ్వర రావు, గణపతిరావు, రంజిత్ కుమార్, సత్యనారాయణ, గోవింద, బూరి ఇళ్ళంనాయుడు, పాలకొండ రామలింగ స్వామి, పిల్లా లక్ష్మన్నాయుడు, పిల్లా తిరుపతిరావు తదితరులతో పాటు శ్రీకాకుళం సాహితీ అరసం, సాహితీలహరి, జనవిజ్ఞాన వేదిక, స్నేహకళాసాహితీలకు చెందిన కవులు, రచయితలు, సాహితీవేత్తలు పెద్ద ఎత్తున పాల్గొని ఆయన కథలు, సాహిత్యం గురించి వివరించారు.

మిమ్స్ ఉద్యోగులకు సంఘీభావం తెలుపుతున్న లోకం మాధవి

మిమ్స్ ఉద్యోగులకు అండగా ఉంటాం

జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి లోకం మాధవి

ప్రజాశక్తి-నెల్లిమర్ల

మిమ్స్ ఉద్యోగుల న్యాయమైన పోరాటానికి జనసేన అండగా ఉంటుందని ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి లోకం మాధవి తెలిపారు. ఆదివారం స్థానిక ఆర్‌ఒబి వద్ద సమస్యల పరిష్కారం కోసం మిమ్స్ ఉద్యోగులు, కార్మికులు చేస్తున్న నిరసన దీక్షా శిబిరాన్ని ఆమె సందర్శించి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మిమ్స్ ఉద్యోగుల న్యాయమైన సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇప్పటికీ మిమ్స్ ఉద్యోగులు డిఎలు, వేతన ఒప్పందం లేకుండా ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఈ సందర్భంగా మిమ్స్ ఉద్యోగులకు రూ.లక్ష విరాళం అందజేశారు. మద్దతు తెలిపిన వారిలో జనసేన నాయకులు రవ్వా నాని, మద్దిల అప్పన్న, తదితరులు ఉన్నారు. ఈ శిబిరంలో మిమ్స్ ఎంప్లాయీస్, వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు టివి రమణ, సిఐటియు నాయకులు కె.రామారావు, ఉద్యోగులు వి.అప్పలనాయుడు, మూర్తి, రాంబాబు, మధు, గౌరి, వరలక్ష్మి, భవానీ, నాగేశ్వరరావు, కాము నాయుడు, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

శంఖారావంతో వైసిపిలో వణుకు

మాజీ మంత్రి కోండ్రు

సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి కోండ్రు

ప్రజాశక్తి-రాజాం

టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ చేపట్టిన శంఖారావం సభలతో వైసిపిలో వణుకు పుడుతోందని మాజీ మంత్రి, రాజాం నియోజకవర్గ ఇన్‌ఛార్జి కోండ్రు మురళీ అన్నారు. ఈనెల 15న రాజాంలో నిర్వహించనున్న శంఖారావం సభ నేపథ్యంలో నియోజకవర్గం విస్తృత స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇది ఎన్నికల శంఖారావమని కోండ్రు అన్నారు. వైసిపి అధికారంలోకి వచ్చాక రాష్ట్రంలో జాబ్ క్యాలెండర్ లేదని, ఒక్క ఉద్యోగాన్ని కూడా భర్తీ చేయలేదని తెలిపారు. టిడిపి అధికారంలో ఉన్నప్పుడు ఐటి ఉద్యోగాలు, టీచర్ ఉద్యోగాలిచ్చామన్నారు. నాసి రకం మద్యంతో వేలాదిమంది ప్రాణాలు తీస్తున్నారని అన్నారు. టిడిపి, వైసిపికి ఉన్న వ్యత్యాసాన్ని ప్రజలు గ్రహించాలన్నారు. నిత్యావసర వస్తువుల ధరలు, ఆర్టీసీ ఛార్జీలు, ఇంటిపన్ను, విద్యుత్ ఛార్జీలు, ఆఖరికి చెత్త పన్ను పెంచిన వైసిపి ప్రభుత్వాన్ని గద్దె దించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని అన్నారు. ఈనేపథ్యంలో నిర్వహించనున్న శంఖారావం సభను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సుమల వెంకట మన్మధరావు, నంది సూర్య ప్రకాశరావు, నాగళ్ళ అప్పల నాయుడు, పిన్నింటి మోహన రావు, కిమిడి అశోక్ కుమార్, గట్టి భాను, గురవాన నారాయణ రావు, ఉరిటి సురేంద్ర, టంకాల కన్నం నాయుడు, శాసపు రమేష్ కుమార్, దుప్పలపూడి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

14న బాడంగిలో శంఖారావం సభ

బాడంగి : ఈ నెల 14న బాడంగిలో టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ శంఖారావం సభ నిర్వహిస్తున్నట్లు మాజీ ఎమ్మెల్యే తెంటు లక్ష్మునాయుడు తెలిపారు. ఆదివారం బాడంగిలో కోడూరు రోడ్డు పక్కన చేపడుతున్న సభ ఏర్పాట్లను ఆయన పరిశీలించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ మొదటిసారిగా బాడంగికి నారా లోకేష్ వస్తున్నారని, పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున హాజరై సభను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు తెంటు రవిబాబు, వైస్ ఎంపిపి ఎస్.భాస్కర్ రావు, నాయకులు పాల్గొన్నారు.

బాడంగిలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్యే తెంటు

క్రమశిక్షణతోనే బంగారు భవిష్యత్తు

ప్రముఖ జీవన నైపుణ్యాల నిపుణులు జట్లీ

ప్రజాశక్తి-గజపతినగరం


విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతున్న జట్లీ

విద్యార్థులు క్రమశిక్షణతోనే బంగారు భవిష్యత్‌కు బాటలు వేసుకోవాలని ప్రముఖ జీవన నైపుణ్యాల నిపుణులు జట్లీ అన్నారు. మరుపల్లిలోని బాలాజీ పాలిటెక్నిక్ కళాశాలలో ఆదివారం మోడల్ పాలిసెట్ పరీక్ష జరిగింది. దీనికి పదోతరగతి చదువుతున్న సుమారు వెయ్యి మంది విద్యార్థులు హాజరయ్యారు. పరీక్ష అనంతరం నిర్వహించిన అవగాహన కార్యక్రమానికి జట్లి ముఖ్యఅతిథిగా విచ్చేసి విద్యార్థులకు ఆత్మవిశ్వాసం పెంపొందించుకుని విజయాలు సాధించే ప్రక్రియ నేర్పించారు. ఉన్నత లక్ష్యాలు సాధించాలంటే ఉత్తమ క్రమ శిక్షణ కలిగి ఉండాలన్నారు. పబ్లిక్ పరీక్షల పట్ల ఆందోళన విడిచి సాధన చేయాలన్నారు. తల్లి తండ్రుల విలువ తెలుసుకుని , వారిని భక్తితో చూసుకోవాలని జట్లి పిలుపు నిచ్చారు. రిటైల్ మేనేజ్మెంట్ ఆఫీసర్ మొహమ్మద్ షరీఫ్ మాట్లాడుతూ అత్యంత కింది స్థాయి నుంచి తాను పైకి వచ్చినట్లు పేర్కొన్నారు. అలాగే ఇప్పటి వరకు పట్టుదలతో 15 దేశాలు వరల్డ్ టూర్ బైక్ పై చేసినట్లు విద్యార్థులకు స్ఫూర్తి నింపారు.ఎవరెస్ట్ పర్వత రోహన కు చేసిన సాధన జీవితంలో ఎంతో ఆనందాన్ని ఇచ్చిందన్నారు. బాలాజీ విద్యాసంస్థలు డైరెక్టర్ రెడ్డి చంద్ర శేఖర్, రెడ్డి పావని మాట్లాడుతూ ఇప్పటివరకు 10 ప్రముఖ కంపెనీలతో ఎంఒయు కుదుర్చుకుని రెండు వేలకు పైగా ఉద్యోగాలు కల్పించినట్లు పేర్కొన్నారు. కాలేజి ప్రిన్సిపల్ , ఫ్యాకల్టీ తదితరులు పాల్గొన్నారు.

బిసి రిజర్వేషన్ కల్పించాలని పాదయాత్ర

ప్రజాశక్తి - పూసపాటిరేగ

తెలగ సామాజిక తరగతికి బిసి రిజర్వేషన్ కల్పించాలని ఉత్తరాంధ్ర తెలగ సంఘం నాయకులు పల్లంట్ల వెంకట రామారావు ఆధ్వర్యాన చేపట్టిన పాదయాత్ర విజయనగరం జిల్లాలోకి ఆదివారం ప్రవేశించింది. మండలంలోని కందివలస గెడ్డవద్ద తెలగ నాయకులు ఆయనకు ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా రామారావు మాట్లాడుతూ తెలగలను బిసిలోకి చేర్చాలన్నది అధికారం కోసం కాదని, ఆకలి చావులు తప్పించుకోవడానికని చెప్పారు. తెలగ సామాజిక తరగతిలో ఎంతోమంది దుర్భర జీవితాలు అనుభవిస్తున్నారన్నారు. పాదయాత్రకు వైసిపి మండల అధ్యక్షులు పతివాడ అప్పలనాయుడు, పలువురు నేతలు సంఘీభావం తెలిపారు. టిడిపి నెల్లిమర్ల నియోజకవర్గ ఇన్‌ఛార్జి కర్రోతు బంగారాజు, డెంకాడ మాజీ ఎంపిపి కంది చంద్రశేఖర్ సంఘీభావం తెలిపారు. పాదయాత్రలో వైస్ ఎంపిపి అల్లాడ రమేష్, రామతీర్థం ఆలయ బోర్డు సభ్యులు దాడిశెట్టి త్రినాథరావు, మాజీ జెడ్‌పిటిసి ఆకిరి ప్రసాదరావు, పుప్పాల లక్ష్మీనారాయణ, మాజీ వైస్ ఎంపిపి పులపా మల్లేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

బానాదిలో పర్యటిస్తున్న ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు

మరొక అవకాశం ఇవ్వండి

ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు

ప్రజాశక్తి-వేపాడ

ప్రజా సంక్షేమానికి అహర్నిశలు శ్రమించిన తమకు మరో అవకాశం ఇవ్వాలని ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు ప్రజలను కోరారు. మండలంలోని బానాది గ్రామంలో ఆదివారం ఆయన పర్యటించారు. గ్రామంలో ప్రతి ఇంటికీ వెళ్లి ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఐదేళ్లలో చేపట్టిన సంక్షేమ పథకాలను వివరిస్తూ తనకు మరొక అవకాశం ఇవ్వాలని కోరారు. ఏ ముఖ్యమంత్రీ చేయని విధంగా ప్రజలకు నేరుగా సంక్షేమ పథకాలు అందించిన ఘనత జగన్‌కే దక్కుతుందని ఎమ్మెల్యే తెలిపారు. గ్రామాలు అభివృద్ధి చెందాలన్నా, సంక్షేమ పథకాలు అందాలన్నా జగన్‌ను మళ్లీ ముఖ్యమంత్రిగా చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎంపిపి డి.సత్యవంతుడు, డిసిసిబి చైర్మన్ వేచలపు వెంకట చినరామునాయుడు, ఎఎంసి చైర్‌పర్సన్ ఎం.కస్తూరి, సర్పంచులు కర్రి యశోద, ఎన్.వెంకటరావు, వైసిపి మండల అధ్యక్షులు ఎం.జగన్నాథం తదితరులు పాల్గొన్నారు.

సిఎం సహాయనిధి చెక్కు అందజేత

ప్రజాశక్తి-గంట్యాడ

చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే బొత్స అప్పలనర్సయ్య

మండలంలోని మదనాపురం గ్రామానికి చెందిన బండారు అన్నపూర్ణమ్మకు ఆదివారం ఎమ్మెల్యే బొత్స అప్పలనర్సయ్య సిఎం రిలీఫ్ ఫండ్ ద్వారా రూ.2లక్షల చెక్కును అందజేశారు. కొన్ని రోజుల నుంచి అన్నపూర్ణమ్మ బ్రెయిన్ ట్యూమర్ వ్యాధితో బాధపడుతూ వైద్యం చేయించుకున్నారు. సుమారుగా ఐదు లక్షల వరకు ఖర్చు అయింది. నిరుపేద కుటుంబం కావడంతో అనేక ఇబ్బందులు గురవుతున్న సమయంలో స్థానిక సర్పంచ్ జాగరపు అప్పారావు.. ఎమ్మెల్యే అప్పలనరసయ్య దృష్టికి తీసుకెళ్లడంతో ఈ విషయాన్ని ఆయన సిఎం జగన్మోహన్ రెడ్డికి చేరవేశారు. సిఎం స్పందించి రూ.2లక్షలు మంజూరు చేశారు. దీంతో చెక్కును అన్నపూర్ణమ్మకు ఎమ్మెల్యే అందజేశారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పిటిసి వర్రి నరసింహమూర్తి, వైసిపి సీనియర్ నాయకులు నారాయణమూర్తి రాజు, మదనాపురం సర్పంచ్ జాగరపు అప్పారావు పాల్గొన్నారు.

ఇంక్యుబేషన్ సెంటర్ ఏర్పాటుకు

బిఎస్ఎన్ఎల్‌తో సీతం ఒప్పందం

ఒప్పందం చేసుకుంటున్న సీతం, బిఎస్ఎన్ఎల్ ప్రతినిధులు

విజయనగరం : సత్య ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ మేనేజ్‌మెంట్ లో ఇంక్యుబేషన్ సెంటర్ ఏర్పాటు చెయ్యడానికి బిఎస్ఎన్ఎల్ తో అవగాహన ఒప్పందం (ఎంఒయు) కుదిరిందని కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఎం.శశిభూషణరావు, పిన్సిపల్ డాక్టర్ డివి రామ మూర్తి తెలిపారు. ఈ ఒప్పంద పత్రాలపై వీరితో పాటు బిఎస్ఎన్ఎల్ డిజిఎం డాక్టర్ మల్లా సత్య ప్రసాద్ సంతకం చేశారు. ఈ ఒప్పందం ద్వారా ఇసిఇ, సిఎస్ఇ, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, ఇఇఇ విద్యార్థులు సాంకేతికతలపై పరిశోధనలు చేసుకునే సౌలభ్యం లభిస్తుందని కళాశాల డైరెక్టర్ శశిభూషణరావు తెలిపారు. కార్యక్రమంలో సీతం ఇసిఇ విభాగాధిపతి డాక్టర్ టిడివిఎ నాయుడు పాల్గొన్నారు.